క్లుప్తంగా

మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలి


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజిరెడ్డి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నార్లాపూర్, వెంకటాపూర్ (కె)గ్రామాల్లోని నర్సరీలను శుక్రవారం ఎంపీడీఓ రాజిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలం నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలని, ఎండ వేడి తట్టుకునేలా చెట్లకు పై భాగంలో గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్, ఆయా గ్రామాల కార్యదర్శిలు ప్రశాంత్ గౌడ్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

విఠలేశ్వరస్వామికి పూజలు

పాపన్నపేట(మెదక్): మండలంలోని పొడిచన్‌పల్లిలోని విఠలేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సోములు తదితరులు ఉన్నారు.

రుణాలు సక్రమంగా చెల్లించాలి

పెద్దశంకరంపేట(మెదక్): మహిళలు తీసుకున్న బ్యాంకు రుణాలను సక్రమంగా చెల్లించాలని డీసీసీబీ మేనేజర్ ఖలీమొద్దీన్ అన్నారు. శుక్రవారం స్త్రీశక్తి భవన్‌లో నిర్వహించిన మహిళా సమాఖ్య, సీసీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గోపాల్, ఫీల్డ్ ఆఫీసర్ భానుచందర్, సీసీలు నిరంజన్, యోహన్, సునీత, వీఓఎలు నగేష్, సాయిలు, పుష్ప, స్వప్న తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న ఎల్లమ్మ రంగస్థల నాటకం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలో గురువారం రాత్రి జరిగిన ఎల్లమ్మ రంగస్థల నాటకం చూపరులను ఆకట్టుకుంది. నాటక నిర్వాహకుడు వెంకయ్య, నాటకంలో ఎల్లమ్మగా నర్సింలు, పరశురాముడిగా కృష్ణ, గౌరమ్మగా రవి, శంకరుడిగా శివగౌడ్, పార్వతీగా అర్జున్, ఇతర పాత్రదారులుగా రాములు, యాదయ్య, భూమయ్య, విఠల్, యాదయ్య, పండరి, బాగయ్య తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమొద్దీన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. ఈద్గా ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించే పనులు కొనసాగుతున్నాయన్నారు. పట్టణంలోని 13, 14 వార్డుల్లో పర్యటించి, ఆయా వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణ పనులను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం


కల్యాణోత్సవంలో భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో శుక్రవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివాలయంలో న్యాసపూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. పడిపూజ మహోత్సవాన్ని గురుస్వామి వీరప్ప, వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ, పవన్‌కుమార్‌శర్మ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ హరికృష్ణ, గణేశ్‌గౌడ్, రాజు దంపతులు , బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల శివ మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

ఆలయంలో హోమం

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లి సాయిబాబా ఆలయంలో వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా విగ్రహానికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే హోమం కూడా నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొండల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా డీఆర్‌సీసీ భవనం

పట్టించుకోని అధికారులు


డీఆర్‌సీసీ సెంటర్ పక్కనే చెత్తను కాల్చుతున్న దృశ్యం

నర్సాపూర్: కరెంట్ కనెక్షన్ లేకపోవడంతో డ్రై రిసోర్సెస్ కలెక్షన్ సెంటర్ (డీఆర్‌సీసీ) భవనం నిరుపయోగంగా ఉంది. నర్సాపూర్ మున్సిపాలిటీ పట్టణ పరిధిలో సేకరించే తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేసే లక్ష్యంతో సుమారు రూ.33లక్షలతో డీఆర్‌సీసీ భవనం నిర్మాణ పనులు చేపట్టారు. భవనం నిర్మాణ పనులు సుమారు నాలుగు నెలల క్రితం పూర్తి చేశారు. భవనంలో చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు కరెంట్ అవసరం ఉంటుంది. కాగా సెంటర్‌కు కరెంట్ కనెక్షన్ కోసం విద్యుత్ శాఖ అధికారుల అంచనా ప్రకారం.. మున్సిపాలిటీ అధికారులు గత ఏడాది డిసెంబర్ 12న రూ. 4 లక్షల 50వేల విలువ చేసే డీడీని విద్యుత్ అధికారులకు అందజేశారు. సెంటర్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్, సుమారు 30 కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేసి కరెంట్ వైరు లాగి కనెక్షన్ ఇవ్వాలి. కానీ మున్సిపాలిటీ అధికారులు డీడీ చెల్లించి రెండున్నర నెలలు కావస్తున్నా.. విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను, స్తంభాలను కూడా ఏర్పాటు చేయ్యలేదు.

పాడవుతున్న పర్యావరణం

చెత్తను కాల్చడంతో పర్యావరణం పాడవుతుంది. పట్టణంలో చెత్తను తడి, పొడి చెత్తను సేకరించి, గా వేరు చేసి డీఆర్‌సీసీ సెంటర్‌లో సేంద్రియ ఎరువు తయారు చేస్తారు. కానీ డీఆర్‌సీసీ సెంటర్ వినియోగంలో లేనందున పట్టణంలో తడి, పొడి చెత్తను కలిపి సేకరించడంతో పాటు దానిని తీసుకెళ్లి పట్టణ శివారులో పారవేసి నిప్పంటిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం ఘాటైన దుర్వాసనతో కూడిన పొగతో నిండిపోతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నిరుపయోగంగా డీఆర్‌సీసీ సెంటర్ భవనం

వినియోగంలోకి తెచ్చేందుకు కృషి



డీఆర్‌సీసీ సెంటర్‌ను త్వరలో వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటా. కరెంట్ కోసం కనెక్షన్ ఇచ్చేలా ఆ శాఖ అధికారులతో చర్చిస్తా. కరెంట్ రాగానే సెంటర్‌ను వినియోగంలోకి తెచ్చి సేంద్రియ ఎరువు తయారు చేసేలా చర్యలు తీసుకుంటా.

– అశోక్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్

టెండర్ దశలో ఉంది

నర్సాపూర్‌లో నిర్మించిన డీఆర్‌సీసీ సెంటరు వద్ద ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలను ఏర్పాటు చేసే పనుల ప్రక్రియ ప్రస్తుతం టెండరు దశలో ఉంది. టెండర్ పూర్తి కాగానే ఏర్పాటు పనులు చేపడుతాం.

– ఏఈ రాజ్‌కుమార్, విద్యుత్ శాఖ


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరావు

రైతు సమస్యలను పరిష్కరించే వారికే ఓటు

రైతు సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరావు

మెదక్: రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎన్నికల మెనిఫెస్టోలో పొందుపరిచిన నాయకులకే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేద్దామని రైతు సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని టీఎస్‌జీఓ భవన్‌లో జిల్లాలోని పలు మండలాల రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర జనాభాలో 70 శాతానికి పైగా వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారన్నారు. అన్నదాతల ఓట్లతో గద్దెనెక్కే రాజకీయ నాయకులు వారి సమస్యల పరిష్కరానికి ఆ ఫైల్‌పైనే తొలిసంతకం పెట్టాలన్నారు. రైతులు పండించిన పంటలకు లాభసాటిగా మద్దతు ధర ప్రకటించాలని కోరారు. సాగుకు పెట్టిన పెట్టుబడితో మూడింతలు ఎంఎస్‌పీ ఉండాలన్నారు. ప్రకటించిన మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకం తికమక పెట్టకుండా ఏ కారణంగా సాగు చేసిన పంటలు ఎండిపోతే కేవలం 30 రోజుల్లో నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పత్రాల యాదాగౌడ్, సంఘ బాధ్యులు మైసయ్య, శ్రీశైలం, వెంకటేశం, శ్యామ్ సుందర్, శేక్‌మదార్, అశోక్‌రెడ్డి, నర్సారెడ్డి, నరేందర్, ఐలేష, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేసుకుంటేనే పీఎం కిసాన్ నిధులు

వ్యవసాయ శాఖ డివిజన్ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ

రామాయంపేట(మెదక్): రైతులు విధిగా ఈకేవైసీ చేసుకుంటేనే పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు ఖాతాల్లో జమ అవుతాయని రామాయంపేట వ్యవసాయశాఖ డివిజన్ ఇన్‌చార్జి సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం కార్యాలయం వద్ద రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని రామాయంపేట, నిజాంపేట, నార్సింగి, చేగుంట మండలాల పరిధిలో మొత్తం 21174 మంది రైతులకు 734 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. గత 15 విడుతలుగా రైతులకు పీఎం కిసాన్ నిధులు జమ అవుతున్నాయని, త్వరలో 16వ విడత నిధులు ఈనెలాఖారు వరకు జమ అవుతాయని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో ఐదు వందల మందికి పైగా రైతులు ఆధార్ కార్డులు, ఇతర పత్రాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో వారి ఖాతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రైతులు తమ సొంతంగా మొబైల్ ఫోన్ ద్వారా లేదా పోస్టాఫీస్ ద్వారా మీసేవా కేంద్రం ద్వారా ఈకేవైసీ చేయించుకోవచ్చని సహాయ సంచాలకులు సూచించారు.


ఈకేవైసీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ

అపరిచిత వ్యక్తులను నమ్మొద్దు


మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేశ్

పాపన్నపేట(మెదక్): అపరిచిత వ్యక్తులను నమ్మొద్దని పాపన్నపేట ఎస్‌ఐ నరేశ్ అన్నారు. శుక్రవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో సఖి కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా అపరిచిత వ్యక్తులు పరిచయం చేసుకొని వారు చెప్పే మోసపూరిత మైన మాటలను నమ్మొద్దని సూచించారు. కొంత మంది ఆన్‌లైన్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాంలో పరిచయాలు పెంచుకొని అమాయకులను మోసం చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా టీనేజ్‌లో ఉన్న అమ్మాయిలు ఈ పరిచయాలకు దూరంగా ఉండాలని సూచించారు. కొంత మంది కిడ్నాప్‌లకు సైతం పాల్పడుతున్నారన్నారు. చిన్న తగాదాలు ఉంటే సఖి కేంద్రం వారు కౌన్సెలింగ్‌తో సమస్యలు పరిష్కరిస్తారని అన్నారు. ఆపత్కాలంలో 100కు ఫోన్ చేస్తే సత్వర సహాయం అందుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేశ్వర్, ఏఎస్‌ఐ సంగన్న, సఖి కేంద్రం నిర్వాహకులు లక్ష్మి, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట పొలాలకు రోడ్డు వేయండి

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్ గ్రామంలోని బసవేశ్వర విగ్రహం రోడ్డు నుంచి పెద్ద చెరువు సమీపంలోని పంట పొలాలకు రోడ్డు వేయాలని రైతులు శుక్రవారం కోరారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు వర్షాకాలంలో బురదమయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మిస్తే తమకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

కనుల పండువగా సీతారామ కల్యాణం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేటలో సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా ఘనంగా నిర్వహించారు. రాజిపేటలో ఆంజనేయస్వామి, శివపంచయాతన ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రామ పురోహితుడు బాపుశర్మ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారామాచంద్రస్వామి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద లడ్డు వేలం వేయగా, నవపేటకు చెందిన నరేందర్‌చారి రూ. 45,100, రాజిపేటకు చెందిన దప్పు పోచయ్యకు రూ.37,100వేలం తీసుకున్నారు. అనంతరం స్వామివారిని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న పండితులు


టేక్మాల్(మెదక్): బొడ్మట్‌పల్లి పాఠశాలలో..


రామాయంపేటలో..

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఆయా పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ బడుల్లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శివ్వంపేట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు


పాపన్నపేట(మెదక్): చీకోడ్ పాఠశాలలో..


కొల్చారం(నర్సాపూర్): అంసాన్‌పల్లిలో పాఠశాలలో..


కొల్చారం(నర్సాపూర్): ఎనగండ్ల పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

రీటెండర్లు వేయడం హర్షణీయం

మెదక్ మున్సిపాలిటీ: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ దుకాణాలను అన్ని ఒత్తిళ్లను ఎదుర్కొని రీటెండర్లు వేయడం హర్షణీయమని మున్సిపల్ దుకాణాల ఐక్య కార్యచరణ సాధన సమితి కన్వీనర్ బాలరాజ్ తెలిపారు. మున్సిపల్ దుకాణాల ఐక్య కార్యచరణ సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహిరంగ వేలం ద్వారా మున్సిపల్ దుకాణాలకు మంచి ఆదరణ లభించడంతోపాటు మున్సిపాలిటీ భారీ ఆదాయం దక్కిందని తెలిపారు. అలాగే పట్టణంలోని పటేల్‌కుంటలోని మిగిలిన 67 షాపులు కూడా నోటిఫికేషన్ ద్వారా బహిరంగ టెండర్లకు పిలవాలని ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ, రవి, ప్రవీణ్, నాగరాజాగౌడ్, శేఖర్, ప్రభాకర్, గోపాల్ నాయక్, సిద్దు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కార్ల అద్దాలు ధ్వంసం**

చిలప్‌చెడ్(నర్సాపూర్): గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వద్ద ఉన్న రెండు కార్ల అద్దాలు పగులగొట్టిన సంఘటన మండలంలోని గౌతాపూర్ గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌతాపూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ రహ్మాన్, బిట్ల మహేశ్ ఇద్దరి కార్లు వారి ఇంటి ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకున్నారు. శుక్రవారం ఉదయం కార్ల వద్దకు వచ్చేసరికి కార్ల అద్దాలు పగిలి ఉన్నాయి.

◆ **కాంగ్రెస్‌పార్టీతోనే అభివృద్ధి సాధ్యం**

తూప్రాన్: రాష్టం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పడాలపల్లికి చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు, బీజేపీ జిల్లా నాయకుడు ఆంజనేయులు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీశైలంగౌడ్, రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ గుప్తా, నాయకులు సిద్ధిరాములుగౌడ్, శశి భూషణ్ రెడ్డి, చెలిమెల రఘుపతి, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నార్లాపూర్‌లో శుక్రవారం పశువైద్య శిబిరాన్ని పశుగణాభివృద్ధి సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా ఆధ్వర్యంలో పశువైద్య పశుసంవర్ధక శాఖ వారి సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీ రాంజీ మాట్లాడుతూ.. పశుసంవర్ధక శాఖ వారి సహకారంతో నార్లాపూర్ గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సంజీవ్, నిజాంపేట వెటర్నరీ డాక్టర్ సుధాకర్, అసిస్టెంట్ రాజు, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఆఫీస్ సబార్డినేట్ అలీ, గోపాల మిత్రులు స్వామి, సంతోష్ రెడ్డి, బాబు, శ్రీను, శ్రీకాంత్, కిషన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

◆ **సామూహిక సీమంతాలు**



పాపన్నపేట(మెదక్): మండలంలోని చిత్రియాల్‌లో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు సామూహిక సీమంతాలు చేశారు. అలాగే చిన్న పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ అప్సరీబేగం, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **మరమ్మతులు చేయండి**

వెల్దుర్తి(తూప్రాన్): గతంలో చెరువు, కుంటల కట్ట మరమ్మతులు చేపట్టిన కాంట్రాక్టర్లు తూములు మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారని సీపీఎం మండల కార్యదర్శి గౌరి అన్నారు. ఆయా తూములను వెంటనే మరమ్మతులు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలంటూ ఇరిగేషన్ సిబ్బందికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

ఆయిల్ పాం సాగుతో లాభాలు

మనోహరాబాద్(తూప్రాన్): ఆయిల్ పాం సాగుతో ఎన్నో లాభాలున్నాయని, ఆరుతడి పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి స్రవంతి అన్నారు. శుక్రవారం మండలంలోని కోనాయపల్లి(పీటీ)లో మండల వ్యవసాయ అధికారులు రైతులతో నూతన వ్యవసాయ పద్ధతులపై కేవీకే వ్యవసాయకేంద్రం శాస్త్రవేత్తలతో కలిసి ఆయిల్ పాం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత రవికుమార్, ఆయిల్ పాం శాస్త్రవేత కృష్ణ, మండల ఏఈఓలు నరేందర్, సచిన్, రైతులు, తదితరులున్నారు.

◆ **ఏబీసీడీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి**

పెద్దశంకరంపేట(మెదక్): బీజేపీ అధికారంలోకి రాగానే ప్రధాని మోదీ వంద రోజుల్లో ఏడీసీడీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి కాలాయాపన చేస్తున్నారని మండల ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాందేడ్ దుర్గయ్య అన్నారు. శుక్రవారం పేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాందేడ్ నాగరాజు, ప్రభాకర్, సంజీవ్, బేతయ్య, సాయిలు, సురేష్ తదితరులున్నారు.

◆ **ముదిరాజ్ సంఘం కమిటీ ఏర్పాటు**

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని పెదమ్మ ఆలయం వద్ద ముదిరాజ్ సంఘ సభ్యులు శుక్రవారం నూతనంగా సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు ముదిరాజ్ సంఘం గ్రామాధ్యక్షుడిగా పంజా బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నాగరాజు, కోశాధికారిగా రెడ్డి రాకేష్, కార్యదర్శిగా బాబు, ప్రధాన కార్యదర్శిగా వెంకటస్వామి, కార్యవర్గ సభ్యులుగా నగేష్, నవీన్, రెడ్డి వెంకట్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మీనర్సింలు, పంజా మహేందర్, సత్తయ్య, దేవుని రాజు తదితరులు ఉన్నారు.

◆ **సన్మానం**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీఓ చిన్నారెడ్డిని కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. అలాగే ఎంపీఓ నరేష్‌ను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్, రుక్మొద్దీన్, కేశవులు, నర్సింలు, కృష్ణాగౌడ్, వినోద్ ఉన్నారు.

పెద్ద చింతకుంటలో..

నర్సాపూర్ రూరల్: మండలంలోని పెద్ద చింతకుంట మాజీ సర్పంచ్ శివకుమార్, ఉప సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం నర్సాపూర్ ఎస్‌ఐ పుష్పరాజును సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి గౌడ్ ప్రసాద్, ప్రసాద్ నాగభూషణం, విష్ణు ఆంజనేయులు మల్లేశం విజయ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మార్చి 3న సన్నద్ధం కావాలి**

చిన్నశంకరంపేట(మెదక్): అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు వైద్య సిబ్బంది సన్నద్ధం కావాలని చిన్నశంకరంపేట మెడికల్ ఆఫీసర్, డాక్టర్ సాయిసింధు కోరారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు పల్స్‌పోలియో సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ హరీషా, హృదయ్, సీహెచ్‌ఓ యాదగిరిరావు, పీహెచ్‌ఎన్ రాణి మనోహర, నిర్మల, నందిని తదితరులు ఉన్నారు.

◆ **సమయపాలన పాటించాలి**

శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధ్యాయులు ప్రతీ రోజు సమయపాలన కచ్చితంగా పాటించాలని ఎంఈఓ బుచ్చనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఉసిరికపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతం, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మెరుగుపడేలా కృషి చేయాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బంది శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్, తదితరులు ఉన్నారు.

◆ **లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం**

నర్సాపూర్ రూరల్: మండలంలోని లింగాపూర్ అటవీ ప్రాంతంలోని గుట్టపై స్వయంభుగా వెలిసిన గండబేరుండ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, గ్రామం నుంచి పల్లకీ సేవలో ఉత్సవ విగ్రహం గుట్టపైకి వేంచేయుట ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం స్వామివారి కల్యాణోత్సవం, ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, గుండమ్మ వద్ద అగ్నిగుండాలు, సాయంత్రం బండ్లు, బోనాల ఊరేగింపు, ఆడపిల్ల అంజమ్మ ఆట ఉంటాయి. సోమవారం పాచి బండ్ల ఊరేగింపు నిర్వహిస్తారు. మంగళవారం స్వామివారి పల్లకీసేవతో గ్రామానికి వేంచేయుటతో ఉత్సవాలు ముగుస్తాయి. కళ్యాణోత్సవాల్లో భక్తి భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. గండబేరుండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం లింగాపూర్ గ్రామానికి చెందిన చెందిన శ్రీనివాస్ గౌడ్ సహకారంతో నిర్మించిన కల్యాణ మండపం ప్రారంభోత్సవ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

◆ **పాఠశాలను పరిశీలన**

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం మండల నోడల్ అధికారి నీరజ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు హాజరవుతున్న విద్యార్థులను పరిశీలించి పలు ప్రశ్నలు అడిగారు. బోధనోపకరనాలతో ఉపాధ్యాయులు పిల్లలకు చదువు చెప్పే పద్ధతులను పరిశీలించారు. అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థులను బాగా చదివించాలని పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.